క్లుప్తంగా

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణంలో కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

సింహవల్లీ తాయారుకు తిరువీధి



అమ్మవారికి హారతి ఇస్తున్న ప్రధానార్చకుడు కరి సీతారామాచార్యులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో కొలువుదీరిన సింహవల్లీతాయారు అమ్మవారికి శుక్రవారం విశేషంగా తిరువీధి జరిగింది. సింహవల్లీ తాయారు, సువర్ణ అమ్మవారి ఉత్సవమూర్తులను పల్లకిలో వేంజేపచేసి ఆలయ బేడామండపంలో తిరువీధి జరిపారు. విశేష హారతులందించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రధానార్చకుడు కరి సీతారామాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా ఆర్టీసీ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం



సింహాచలం డిపో వద్ద జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

సింహాచలం: ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ 74వ ఆవిర్భావ దినోత్సవాన్ని సింహాచలం ఆర్టీసీ డిపోలో యూనియన్ నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రీజనల్ అధ్యక్షుడు కేఎస్ఎస్ మూర్తి పాల్గొని, యూనియన్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనియన్ ఆవిర్భవించిననాటి నుంచి కార్మికుల సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలు చేసిందన్నారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. యూనియన్ రీజినల్ కోశాధికారి కేఎంఎస్‌పీ స్వామి, డిపో అధ్యక్షుడు రమణ, సెక్రటరీ నాయుడు, కోశాధికారి గుప్తా, గ్యారేజీ సెక్రటరీ రమణ, సీనియర్ నాయకులు బీవై రత్నం పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం



శంకుస్థాపన చేస్తున్న సీతారామయ్య

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం మంజూరు చేసిన రూ.8 లక్షలతో నాయుడుపాలెం శివారు గొల్లపేట–కొండవానిపాలెం వరకు 140 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కూండ్రపు సీతారామయ్య శుక్రవారం శంకుస్థాపన చేశారు. సీసీ రోడ్డు నిర్మాణ స్థలంలో అడ్డంకిగా ఉన్న తుప్పలు, ముళ్ల పొదలను పొక్లెయిన్‌తో తొలగించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కూండ్రపు శ్రీరామ్మూర్తి, స్థానిక నాయకులు సారిపల్లి నేస్తాలు, జి.నరేష్, వియ్యపు అప్పలరాజు, సారిపల్లి సోమునాయుడు పాల్గొన్నారు.

శాకంబరిగా దుర్గమ్మ



పెందుర్తి: ఆషాఢ మాసం 3వ శుక్రవారం సందర్భంగా ఎస్ఆర్ పురంలోని కనకదుర్గమ్మ సన్నిధిలో ప్రత్యేక పూజలు జరిపారు. అమ్మవారు శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. కుంకుమ పూజలు జరిపి, ఆలయ ధర్మకర్త కాయిత ఎర్రిబాబు ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేశారు.

ఘనంగా జనాభా దినోత్సవం

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి మాట్లాడుతూ అత్యధిక జనాభా ఉన్న భారత్‌లాంటి దేశాల్లో జనాభా నియంత్రణ ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. అదే విధంగా జనాభా ప్రాముఖ్యత, సామాజిక ప్రభావాలపై అవగాహన కల్పించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శంకర్, అధ్యాపకులు ఎస్.సత్యనారాయణ, ఎంవీ రామకృష్ణ, ఎం.గోవిందరావు, బి.లక్ష్మి, ఎల్.గణేష్ పాల్గొన్నారు.

దయనీయం.. ప్రభుత్వ వైద్యం



ఏ ప్రభుత్వ ఆస్పత్రికైనా రోగుల సంఖ్య తగ్గిందంటే ఆ ప్రాంతంలో రోగాల బెడద లేదనుకుంటాం. కానీ సబ్బవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిస్థితి పూర్తిగా భిన్నం. ఈ పరిసర ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలుతున్నా ఈ ఆస్పత్రికి వెళ్లేందుకు మాత్రం సాహసించట్లేదు. గతంలో 30 పడకల అస్పత్రిగా ఎంతో మందికి వైద్యసేవలు అందించిన ఆస్పత్రి ప్రస్తుతం కనీస వసతుల్లేక కునారిల్లుతోంది.

- నిర్లక్ష్యం నీడలో సబ్బవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
- ప్రారంభంలో 30 పడకల ఆస్పత్రిగా సేవలు
- డీ గ్రేడ్ కావడంతో ఆరు పడకలకు పరిమితం
- గతంలో 80 మంది సిబ్బంది.. ప్రస్తుతం 14 మంది!
- అరకొర వైద్య సేవలతో రోగుల రాక తగ్గుముఖం



శిథిల స్థితికి చేరిన సబ్బవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



పీహెచ్‌సీలో ఓపీ రాస్తున్న వైద్య సిబ్బంది

సబ్బవరం: మండలంలోని సబ్బవరం జాతీయ రహదారికి అనుకుని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) ఉంది. దీంతో ఏజెన్సీ నుంచి విశాఖ వెళ్లే ప్రజలతోపాటు, రోడ్డు ప్రమాదాలకు గురైన వారికి ఇక్కడే సత్వర వైద్య సేవలు అందించేవారు. అప్పట్లో 30 పడకల ఆస్పత్రిగా ఉన్న ఇది క్రమేపీ డీ గ్రేడ్ కావడంతో 6 పడకల ఆస్పత్రిగా మిగిలిపోయింది. గత ప్రభుత్వంలో దీని స్థాయి పెంచే ప్రయత్నాలు జరిగాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ పూర్వ స్థితికి చేరుకుంది. సేవలు అరకొరగా అందుతుండటంతో ప్రజల ఆదరణ కూడా తగ్గింది. ప్రస్తుతం వైద్య సేవలూ అంతంతమాత్రమే. వీటికి తోడు ఆస్పత్రి భవనాలు సైతం శిథిలావస్థకు చేరి, ఆ దిశగా రోగులు వెళ్లాలంటేనే భయపడే పరిస్థితులు నెలకొన్నాయి.

గతమెంతో ఘనం.. ఇపుడంతే దైన్యం

దాదాపు 45 ఏళ్ల క్రితం ఇక్కడ 30 పడకల ఆస్పత్రిని ప్రారంభించారు. చాలాకాలం పాటు ఆస్పత్రిలో అన్ని రకాల వసతులు, వైద్య సేవలు అందేవి. దీంతో మండల వాసులే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాలవారికీ 24 గంటలూ అత్యవసర వైద్యంతో పాటు ఓపీ సేవలను అందించేవారు. ఆస్పత్రిలో పలు శస్త్ర చికిత్సలను చేయడంతో రోగుల తాకిడి అధికంగా ఉండేది. అదంతా గతంగా మారింది. ప్రస్తుతం ఆస్పత్రిలో అరకొర సిబ్బంది ఉండటంతో.. అన్ని రకాల వైద్య సేవలు దొరకని పరిస్థితి. కొన్నిసార్లు తప్పనిసరి పరిస్థితిలో డాక్టర్లు సెలవుపెడితే ఇక అంతే సంగతులు.

80 నుంచి 14కు సిబ్బంది!

30 పడకల ఆస్పత్రిగా ఉన్నప్పుడు సుమారు 80 మంది వైద్య సిబ్బంది ఉండేవారు. ఐదుగురు డాక్టర్లు, ఐదుగురు స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఇతర సిబ్బందితో రోగులకు అన్ని రకాల సేవలు అందించేవారు. ప్రస్తుతం సిబ్బంది సంఖ్య 14కు పరిమితమైంది. అందులో ఇద్దరు డాక్టర్లు, ముగ్గురు స్టాఫ్ నర్సులు, ఒక్కో ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, ఆప్తాలమీ అసిస్టెంట్, అటెండర్, వాచ్‌మన్ ఉండగా, సూపర్‌వైజర్లు ఐదుగురున్నారు. దీంతో పూర్తి స్థాయి సేవలు అందడం గగనమైపోయింది.

శిథిలావస్థకు భవనాలు

ప్రస్తుతం ఆస్పత్రి భవనాలు శిథిలావస్థకు చేరాయి. వర్షాలకు నీరు కారిపోతోంది. చాలా గదులు నిరుపయోగంగా ఉన్నాయి. జనాభా స్థాయిలో ఓపీలు నమోదు కావట్లేదు. అయినా రోజూ కనీసం 100–150 మంది ఆస్పత్రికి వస్తుంటారు. వీరికి అన్నిరకాల వైద్య సేవలు దొరకక అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి, లేదా విశాఖలోని కేజీహెచ్ బాట పడుతున్నారు. ప్రజాప్రతినిధులు తరచూ ఆస్పత్రిని సందర్శించి ప్రకటనలు గుప్పించడం తప్ప, అవేవీ కార్యాచరణకు నోచుకోవట్లేదు.

గత ప్రభుత్వంలో ప్రత్యేక చర్యలు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిర్మించిన అదనపు బ్లాక్

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 15వ ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ.50 లక్షలతో అదనపు బ్లాక్‌ను నిర్మించారు. స్పెషలిస్టు వైద్యులను నియమించి, రోగులకు అన్ని రకాల వైద్య సేవలు అందేలా చూశారు. వారంలో రెండు రోజులపాటు ఓ రోజు ఈఎన్టీ, మరో రోజు జనరల్ సర్జన్ సేవలు అందించేవారు. ఎన్నికలు జరిగి, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్పెషలిస్ట్ సేవలు పూర్తిగా ఆగిపోయాయి. వీటితో పాటు ఆస్పత్రికి అవసరమైన కనీస వసతులూ కరువయ్యాయి. ఆస్పత్రిలో తాగునీరు, వాడుక నీటికీ ఇబ్బంది నెలకొంది.

24 గంటలూ సేవలు



ప్రస్తుతం ఆస్పత్రి డీ గ్రేడ్ కావడంతో జీవో నెం.143 ప్రకారం 14 మంది సిబ్బంది మాత్రమే ఉంటారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు ఓపీ సేవలు, 24 గంటలూ అత్యవసర సేవలు అందిస్తున్నాం. ప్రస్తుతం ఒక డెంటల్ డాక్టర్, మరొక నేత్ర వైద్య నిపుణులు ఇక్కడ అదనంగా సేవలు అందిస్తున్నారు.

– డాక్టర్ ఎస్ఎస్ చక్రవర్తి, ప్రధాన వైద్యాధికారి, సబ్బవరం పీహెచ్‌సీ

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

- మొగలిపురం పర్యటనలో జెడ్పీ సీఈవో నారాయణమూర్తి



పారిశుధ్య నిర్వహణపై గ్రామస్తులు, అధికారులతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో నారాయణమూర్తి

సబ్బవరం: పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత కావాలని జిల్లా పరిషత్ సీఈవో నారాయణమూర్తి పిలుపునిచ్చారు. మండలంలోని మొగలిపురంలో శుక్రవారం ఆయన పర్యటించారు. గ్రామంలోని సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి చెత్త సేకరణ, పారిశుధ్య నిర్వహణపై అధికారులను ఆరా తీశారు. రక్షిత మంచినీటి పథకం, డ్రైన్‌ల నిర్వహణ, నిర్మాణంలో ఉన్న సచివాలయ భవనం, నిలిచిన జల్ జీవన్ మిషన్ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజలు భాగస్వామ్యం కావాలన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు గ్రామాలను సందర్శించి అభివృద్ధి పనులను సమీక్షిస్తూ, పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.పద్మజ, ఈవోపీఆర్డీ డి.చైతన్య, పంచాయతీ కార్యదర్శి రజని, గ్రామ పెద్దలు తమరాణ బంగారినాయుడు, అంగటి నానాజీ, సత్యనారాయణ, మేడపాటి రాము, గండి నరేష్, బైలపూడి పోతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇరుకు వంతెనతో ఇక్కట్లు



ముత్యాలమ్మపాలెం రహదారిలో ఇరుకుగా మారిన వంతెన

పరవాడ: వాడచీపురుపల్లి–ముత్యాలమ్మపాలెం రహదారిలో ముత్యమాంబ ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన వంతెన ఇరుకుగా మారి, ప్రమాదకరంగా ఉంది. రహదారిలో సుమారు 20 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ వంతెన శిథిలావస్థకు చేరంది. వంతెనపై ఇరువైపులా నిర్మించిన రక్షణ గోడలూ పూర్తిగా ధ్వంసమయ్యాయి. స్థానిక మత్స్యకారులతో పాటు బీచ్‌కు వచ్చే పోయేవారితో రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. వంతెన ఇరుకుగా ఉండడం వల్ల ఏదైన భారీ వాహనం వస్తే వంతెనపై తప్పించుకోవడం గగనమవుతోంది. మత్స్యకార్మికులు వేటాడిన మత్స్య సంపదను పట్టణ ప్రాంతాలకు తరలించేందుకు ఉపయోగిస్తున్న భారీ వాహనాలను శిథిల వంతెనపై నుంచి నడపడానికి డ్రైవర్లు ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోంది. రహదారిలో అంతంతమాత్రంగా ఏర్పాటు చేసిన వీధి దీపాల కారణంగా చీకటిపడితే రక్షణ గోడలు లేని వంతెన పైనుంచి రాకపోకలు సాగించాలంటే భయపడుతున్నారు. ఆరేళ్ల క్రితం రహదారి విస్తరణలో భాగంగా శిథిల దశకు చేరిన వంతెనను అభివృద్ధి చేయాలని ప్రజలు కోరినా, అమలుకు నోచుకోలేదు. ఇప్పటికైనా తమ ఇబ్బందుల్ని గుర్తించి శిథిల వంతెనను తొలగించి, కొత్తగా వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కుటుంబ నియంత్రణపై అవగాహన తప్పనిసరి



పరవాడలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పరవాడ: చిన్న కుటుంబమే దేశానికి సౌభాగ్యమని పరవాడ ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ జయశ్రీ కరిష్మా అన్నారు. పరవాడలో శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవంలో భాగంగా వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ జయశ్రీ కరిష్మా మాట్లాడుతూ ఆరోగ్యకరమైన సంతానం కోసం బిడ్డకు బిడ్డకు కనీసం మూడేళ్ల వ్యవధి ఉండేలా ప్రణాళిక వేసుకోవాలన్నారు. బాల్య వివాహాల వలన అనారోగ్యకరమైన పిల్లలు జన్మించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ఆడపిల్లలకు యుక్త వయస్సు వచ్చిన తరువాతే వివాహం చేయాలన్నారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా కాన్పు సమయంలో తల్లీ బిడ్డ క్షేమంగా ఉంటారన్నారు. కుటుంబ నియంత్రణ పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ హారిక, కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ ఎం.ఎస్.సాయిరాం, పీహెచ్ఎన్ జానకీరామన్, సూపర్‌వైజర్లు ఎంఎస్ ప్రసాద్‌కుమార్, పీవీ రత్నం, స్టాఫ్ నర్స్ చైతన్య, ఫార్మసిస్ట్ విజయకుమారి, ఎల్‌టీ అన్నపూర్ణేశ్వరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అసకపల్లిలో ఆక్రమణల తొలగింపు



అక్రమ నిర్మాణ తొలగింపులో రెవెన్యూ సిబ్బంది

సబ్బవరం: మండలంలోని అసకపల్లిలో ప్రభుత్వ భూమిలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు శుక్రవారం తొలగించారు. రెవెన్యూ పరిధి సర్వే నెం.1లోని ప్రభుత్వ భూమిలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై అందిన ఫిర్యాదు మేరకు తొలగింపు చర్యలు చేపట్టినట్లు తహసీల్దార్ బి.చిన్నికృష్ణ తెలిపారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు భూ కబ్జా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట ఆర్ఐ వీరయ్య, వీర్వోలు ఉన్నారు.

నైపుణ్యాల మెరుగు నిరంతర ప్రక్రియ

- లోటస్ వైర్‌లెస్ టెక్నాలజీ ఇంజినీరింగ్ హెడ్ వరప్రసాద్



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న వరప్రసాద్

పెందుర్తి: ఆధునిక ప్రపంచంలో పరిశ్రమలు నైపుణ్యానికి పెద్దపీట వేస్తున్నాయని, ఆయా పరిశ్రమలకు అనుగుణంగా నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాలని లోటస్ వైర్‌లెస్ టెక్నాలజీస్ ఇండియా లిమిటెడ్ ఇంజినీరింగ్ విభాగాధిపతి వరప్రసాద్ సూచించారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సదస్సును శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా టెక్నాలజీని అందిపుచ్చుకోవాలన్నారు. నైపుణ్యాన్ని మెరుగుపరుచుకుంటేనే పరిశ్రమల్లో ఉన్నతస్థాయి కొలువులు సాధించవచ్చన్నారు. కళాశాలలోని పీఎల్‌సీ ఆటోమేషన్ కేంద్రం ద్వారా 6 నెలల పాటు ఉచిత శిక్షణ అందిస్తామన్నారు. ఈ నెల 14 నుంచి తరగతులు ప్రారంభిచనున్నట్లు పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈసీఈ తృతీయ సంవత్సర విద్యార్థులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిక్షణ ప్రాముఖ్యత, ఉద్యోగావకాశాల గురించి వివరించారు. గతంలో ఈ శిక్షణలో పాల్గొని లోటస్ సంస్థలో ఉన్నత స్థాయి ఉద్యోగాన్ని పొందిన పూర్వ విద్యార్థిని ధనలక్ష్మి తన అనుభవాన్ని విద్యార్థులకు వివరించారు. ఈసీఈ హెచ్‌వోడీ నాగమణి, ప్లేస్‌మెంట్ అధికారి జయలక్ష్మి, సీఎస్ఆర్ అధికారి జగదీష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణలో ఆర్టీసీ సేవలు ప్రశంసనీయం

- ప్రతిభ చూపిన ఉద్యోగులకు అభినందన



ఉద్యోగుల అభినందన సభలో మాట్లాడుతున్న ఆర్టీసీ రీజనల్ మేనేజర్ అప్పలనాయుడు

సింహాచలం: గిరి ప్రదక్షిణలో భక్తులను వారి గమ్య స్థానాలకు చేర్చడంలో ఆర్టీసీ అత్యుత్తమ సేవలందించిందని సంస్థ విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు అన్నారు. గిరిప్రదక్షిణలో అత్యుత్తమ సేవలందించిన ఉద్యోగుల అభినందన సభ సింహాచలం ఆర్టీసీ డిపోలో శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న అప్పలనాయుడు మాట్లాడుతూ సింహాచలం కొండ పైనుంచి దిగువకు 55 బస్సులు షటిల్ సర్వీసులుగా నడిపామని, నగర వ్యాప్తంగా 150 బస్సులు తిప్పినట్లు పేర్కొన్నారు. భక్తులకు మెరుగైన సేవలు అందించడంలో కీలకపాత్ర పోషించిన సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఉత్తమ సేవలందించిన సింహాచలం డిపో కండక్టర్లు ఎల్‌ఏ కుమార్, కేఎస్ రాజు, డ్రైవర్లు ఆర్ఆర్ నాయుడు, ఎంఈ రావు, సీహెచ్ నాయుడులను అభినందించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ శరత్, అసిస్టెంట్ మేనేజర్ రమణమూర్తి, అసిస్టెంట్ ఇంజనీర్లు సుధారాణి, కొండలరావు, అసోసియేషన్ నాయకులు, డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్లు, డ్రైన్లకు శంకుస్థాపన



88వ వార్డులో సీసీ రోడ్లు, డ్రైన్లకు మేయర్ శ్రీనివాస్‌తో కలిసి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు తదితరులు

సబ్బవరం: మండలంలోని జీవీఎంసీ పరిధి 88వ వార్డులోని పలు గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైన్లకు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు చేతులమీదుగా శుక్రవారం శంకుస్థాపన చేశారు. రూ.3.30 కోట్ల జీవీఎంసీ నిధులతో ఇందిరానగర్, కొత్తూరు బీసీ కాలనీ, కొత్తూరు, నాగరాజు తోట, వెదుళ్ల నరవ, ఎన్టీఆర్ కాలనీ, ముత్యమాంబ కాలనీ తదితర గ్రామాల్లో ఈ పనుల్ని చేపడుతున్నట్లు వెల్లడించారు. వీటిని త్వరితగతిన పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. పనుల్లో నాణ్యతా లోపం లేకుండా చూడాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. కార్యక్రమంలో జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావు, కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు, జోన్–6 జోనల్ కమిషనర్ శేషాద్రి, సీనియర్ నాయకులు ఇందల రమణ, గంతకోరు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రోడ్ల అంచులు



పరవాడ–గాజువాక రహదారిలో ప్రమాదకరంగా మారిన రోడ్డు అంచు

పరవాడ: మండలంలో అనేక రహదారుల అంచులు ప్రమాదకరంగా మారడంతో ప్రయాణికులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. రహదారులు నిర్మించే సమయంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న అంచులను మట్టితో పూడ్చాల్సిన కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, వదిలేశారు. వీటికి తోడు భారీ వర్షాలకు రోడ్లు కోతకు గురై రోడ్డు పక్కనున్న మట్టి కొట్టుకుపోయింది. యలమంచిలి–గాజువాక రహదారి, పరవాడ–లంకెలపాలెం రోడ్డు, పరవాడ–అనకాపల్లి, లంకెలపాలెం–సబ్బవరం రోడ్లతో పాటు పలు గ్రామీణ రహదారుల అంచులు ప్రమాదకరంగా మారాయి. రోడ్ల అంచులపై నుంచి రాకపోకలు సాగించే సమయంలో వాహనచోదకులు అదుపు తప్పి, వెనుక నుంచి వస్తున్న వాహనాల కింద పడి ప్రమాదాలకు గురవుతున్నారు. గతంలో పరవాడ పెట్రోల్ బంకు సమీపంలో ఇలాంటి ప్రమాదం జరిగి ఓ ప్రయాణికుడు లారీ కింద పడి ప్రాణాలు పోగొట్టుకున్నాడు. ప్రమాదకరంగా మారిన రోడ్డు అంచులను గుర్తించి, తగు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రేపు గొరపల్లిలో పశువుల సంత

పెందుర్తి: మండలంలోని గొరపల్లి పంచాయతీ బసవనాయుడు చెరువులో ఆదివారం సామాజిక పశువుల సంతను ప్రారంభించనున్నట్లు గ్రామ సర్పంచ్ గొరపల్లి శ్రీను శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని అనేక ప్రాంతాల నుంచి పశువులు, కోళ్లు ఈ సంతకు విక్రయానికి వస్తాయన్నారు. ఆసక్తి ఉన్నవారు ఇక్కడకు వచ్చి వ్యవసాయం, పాడి నిమిత్తం పశువులను కొనుగోలు చేసుకోవచ్చని పేర్కొన్నారు. నాణ్యమైన దేశీయ కోళ్లు దొరుకుతాయన్నారు.

నువ్వు పంట దిగుబడి ప్రయోగం



నువ్వు పంట దిగుబడి ప్రయోగం చేస్తున్న డీఎస్‌వో గిరిబాబు, ఏఎస్‌వో రజనీకుమారి

పెందుర్తి: తొలకరిలో వేసిన అపరాల పంటలు పక్వానికి వచ్చాయి. నియోజకవర్గంలో దాదాపు 2 వేల ఎకరాల్లో వేసిన నువ్వు, గంటి, ఇతర అపరాలు పండాయి. దీంతో నువ్వు పంట దిగుబడి ప్రయోగాన్ని అధికారులు చేపట్టారు. డీఎస్‌వో గిరిబాబు ఆధ్వర్యంలో పెందుర్తి మండలం పినగాడిలో నువ్వు చేను దిగుబడి ప్రయోగాన్ని నిర్వహించారు. పెందుర్తి ఏఎస్‌వో రజనీకుమారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆదర్శ్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల కరస్పాండెంట్ థియోఫిలాస్, సిబ్బంది

పెందుర్తి: ఆంధ్రయూనివర్సిటీలో జరిగిన ప్రపంచ జనాభా దినోత్సవంలో భాగంగా నిర్వహించిన పలు పోటీల్లో స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాల విద్యార్థులు మెరిశారు. వ్యాస రచన, వ్యక్తృత్వ తదితర పోటీల్లో గెలుపొందిన ఎల్.మాధవి, కె.డిల్లీశ్వరి, ఎ.ఐశ్వర్య, ఆర్.యానిజోయ్, ఎస్కే జబీనా యాస్మిన్, వి.భవ్య శ్రీలు ఏయూ ప్రతినిధుల చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. విజేతలను శుక్రవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కరస్పాండెంట్ టి.థియోఫిలాస్, ప్రిన్సిపాల్ ఎస్ఈ ఫ్లోరా, సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.